సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 29 । జూలై । 2024



ఇన్‌స్పైర్ చేద్దామా..

ఇన్‌స్పైర్ పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. సెప్టెంబర్ 15 వరకు గడువు ఉంది.

- 8లో



రెండో జాబితాపై కసరత్తు

ట్రిపుల్ ఐటీ రెండో జాబితాపై కసరత్తు జరుగుతోంది. 30 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

- 8లో

30 నుంచి కథా నిలయంలో ఉచితంగా పుస్తకాల వితరణ

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలో ఉన్న కథా నిలయంలో ఈ నెల 30 నుంచి పుస్తకాల వితరణ కార్యక్రమం ఆరురోజుల పాటు అనగా ఆగస్టు 4 వరకు నిర్వహిస్తున్నట్లు కథానిలయం ట్రస్టు ప్రతినిధులు ప్రకటించారు. కథానిలయంలో ఒకటి కన్నా ఎక్కువ ఉన్న ప్రతులను వ్యక్తులకు గానీ, సంస్థలకు గానీ అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి, రెండు విడతలకు కాకుండా మూడో విడత వితరణకు సాహిత్యాభిమానులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి ప్రేరణకు కేజీబీవీ విద్యార్థిని ఎంపిక



బూర్జ: జాతీయ స్థాయి ప్రేరణ కార్యక్రమానికి బూర్జ మండలం కొల్లివలస కేజీబీవీ విద్యార్థిని గుజ్జల లిఖిత ఎంపికైనట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ కె.గాయత్రి ఆదివారం తెలియ జేశారు. ఈ విద్యార్థిని ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లిఖిత ఎంపికైంది. ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు గుజరాత్‌లోని వాద్‌నగర్‌లో జరిగే ప్రేరణ కార్యక్రమానికి ఆమె హాజరవుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. దీంతో ప్రిన్సిపాల్‌తో పాటు బోధన, బోధనేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో పీడీలు

పాతపట్నం: పాతపట్నం ఎన్టీఆర్ గ్రీన్‌ఫీల్డ్ మినీ స్టేడియంలో జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో.. ఆదివారం జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ ఎంపికలను నిర్వహించామని అసోసియేషన్ అధ్యక్షుడు జి.అప్పన్న తెలిపారు. సీనియర్ పీడీలు వై.శేఖర్ బాబు, జె.కృష్ణ, జె.శ్రీను, బి.లోకేష్, సుజాత, దుర్గమ్మ పర్యవేక్షణలో క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. జిల్లా స్థాయిలో బాలురు 35మంది, బాలికలు 25 మంది ఎంపికయ్యారు. వీరు విజయవాడ ఇందిరా ప్రియదర్శిని స్టేడియం టెన్నిస్ కోర్టులో ఆగస్టు 4, 5వ తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

మూడు ఇసుక లారీలు, ట్రాక్టర్, జేసీబీ సీజ్



అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక లారీలు

ఆమదాలవలస: మండలంలోని నాగావళి నదీ తీర ప్రాంతంలో ఇసుక దోపిడీ పెద్ద ఎత్తున జరుగుతోంది. ఒక వైపు అధికారులు ఇసుక అక్రమ రవాణా వద్దంటూ హెచ్చరిస్తూ నదిలోకి వాహనాలు వెళ్లనీయకుండా గోతులు తీస్తున్నా రాత్రి వేళల్లో ఆ గోతులు పూడ్చుకొని దందాకు ఎగబడుతున్నారు. మండలంలోని నాగావళి నది పరివాహక ప్రాంతం సీపానపేట–నిమ్మతొర్లువాడ గ్రామాల మధ్యలో ఎలాంటి అనుమతులు లేకుండా శనివారం రాత్రి నదిలో జేసీబీలను దించి ట్రాక్టర్లు, లారీలకు ఇసుక ఎత్తిపోశారు. దీనిపై దాడులు నిర్వహించి మూడు లారీలు, జేసీబీ, ట్రాక్టర్‌ను సీజ్ చేశామని ఆమదాలవలస ఎస్ఐ కె.వెంకటేష్ ఆదివారం తెలిపారు. దీనిపై కేసు నమోదుచేశామని పేర్కొన్నారు.

10, 11 తేదీల్లో జిల్లాస్థాయి స్విమ్మింగ్ ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని శాంతినగర్ స్విమ్మింగ్ పూల్ వేదికగా ఆగస్టు 10, 11 తేదీల్లో జిల్లాస్థాయి స్విమ్మింగ్ క్రీడాకారుల చాంపియన్‌షిప్ పోటీలతోపాటు అదేరోజు రాష్ట్ర పోటీలకు క్రీడాకారుల ఎంపికలను నిర్వహించనున్నారు. ఇందుకు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది. 5 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారికి వివిధ స్థాయిల్లో పోటీలను నిర్వహించడంతోపాటు పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేయనున్నారు. అలాగే గ్రూప్–1 నుంచి గ్రూప్–6 మధ్య 5 ఏళ్ల నుంచి 17 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన క్రీడాకారులకు ఎంపిక పోటీలను నిర్వహించి రాష్ట్రపోటీలకు పంపించేలా చర్యలు తీసుకోనున్నారు. ఇక్కడ ఎంపికైన జిల్లా క్రీడాకారులను పల్నాడు జిల్లా నర్సారావుపేటలోని ఎస్ఎస్ఎన్అండ్ఎన్ కాలేజీలో ఉన్న స్విమ్మింగ్ పూల్ వేదికగా జరిగే రాష్ట్రస్థాయి స్విమ్మింగ్, వాటర్‌పోలో పోటీలకు పంపించనున్నారు.

జిల్లాస్థాయి స్విమ్మింగ్ మీట్ కమ్ సెలెక్షన్ ట్రయల్స్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కేఎన్ఎస్‌వీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎ.రూస్సీ పిలుపునిచ్చారు. క్రీడాకారులు స్విమ్మింగ్ పూల్ వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలని వారు సూచించారు. ఎంట్రీ ఫీజుగా రూ.200, ఈవెంట్‌కు రూ.50 చొప్పున చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు తీసుకురావడం తప్పనిసరని, వివరాలకు 94935 09090ని సంప్రదించాలన్నారు.



సీడ్ బాల్స్ తయారు చేస్తున్న స్కూల్ విద్యార్థులు



బీజ మంత్రం

భూమాతకు ఆకుపచ్చ పట్టుచీర చుట్టేందుకు భగీరథ ప్రయత్నం జరుగుతోంది. రేపటి తరం స్వచ్ఛమైన గాలి పీల్చుకునేందుకు బృహత్తర క్రతువు మొదలైంది. నింగికి నేలకు వానబంధం తెగిపోకుండా ఉండేందుకు 'బీజ' మంత్ర పారాయణం ప్రారంభమైంది. రానున్న ఐదేళ్ల కోసం 'పచ్చ'వర్ష ప్రణాళిక రచిస్తూ విద్యార్థులు విత్తన బంతులు తయారు చేస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా లక్ష విత్తన బంతులు తయారు చేసి నేల తల్లికి కానుకగా ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నారు.

- పర్యావరణ రక్షణ కోసం విశిష్ట ప్రయత్నం
- లక్ష విత్తన బంతుల తయారీ
- 20 స్కూళ్లలో క్రతువు
- ఈ నెలాఖరుతో ముగియనున్న స్పెషల్ డ్రైవ్

శ్రీకాకుళం కల్చరల్:

ఈ రోజు కంటే రేపు స్వచ్ఛమైన గాలి జనులకు అందాలి. నేటి కంటే రేపు అధికంగా వానలు కురవాలి. ఐదేళ్ల తర్వాత మన చుట్టుపక్కల ప్రాంతమంతా ఆకుపచ్చ రంగులో కళకళలాడాలి. ఈ సత్సంకల్పమే విద్యార్థుల చేత విత్తన బంతులు తయారు చేయిస్తోంది. లక్ష విత్తన బంతుల తయారీలో జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు నిమగ్నమై ఉన్నారు. ఈ యజ్ఞం పూర్తయ్యి, ఆ విత్తనాలు మొక్కలుగా పెరిగి, వృక్షాలుగా పెరిగితే పర్యావరణం బృందావనంలా మారుతుంది.

ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో జూన్ 5 నుంచి ఆగస్టు 19 వరకు జిల్లాలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ తలపెట్టారు. భావితరాలకు మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తూనే విద్యార్థులకు విత్తన బంతుల తయారీ బాధ్యతను అప్పగించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధి దార్లపూడి రవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జిల్లాలోని స్కూళ్లలో నిర్వహిస్తున్నారు. మొక్కలు పెంచడానికి అవసరమైన సీడ్ బాల్స్‌ను ఎలా తయారు చేయాలనే దానిపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటుగా వారితోనే నేరుగా తయారు చేయిస్తున్నారు. ఈ నెలాఖరులోగా 20 పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు చెబుతున్నారు.

ఎలా తయారు చేస్తారు.?

విత్తన బంతులు తయారీకి అవసరమైన వస్తువులను ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధులు పట్టుకొని స్కూళ్లకు వెళ్లి విద్యార్థుల చేత తయారు చేయిస్తున్నారు. అందుకోసం పొలం మట్టి, వేపపిండి, కొబ్బరి పొట్టు, ఊక కాల్చిన బూడిదలను మొత్తంగా కలిపి వాటి మధ్యలో విత్తనాన్ని ఉంచి బంతులు తయారు చేస్తారు.

ఐదేళ్ల ప్రణాళిక

విద్యార్థులు తయారు చేసిన లక్ష విత్తన బంతులను డ్రోన్స్ ద్వారా కాని, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ద్వారా కాని వర్షపాతం తక్కువగా ఉన్న మండలాలు, కొండ ప్రాంతాల్లో వెదజల్లే కార్యక్రమం జరుగుతుంది. ఈ విధంగా ఐదేళ్ల పాటు నిర్వహించాల్సి ఉంటుంది. చల్లిన విత్తనాల్లో 25 వరకు మొక్కలుగా పెరిగే అవకాశం ఉంది. అందువల్ల ఈ ప్రణాళిక 5 ఏళ్లు కొనసాగిస్తే దేశ మంతా పచ్చదనంతో కళకళలాడుతుందని నిర్వాహకుల అభిప్రాయం. దీనికి కేంద్ర ప్రభుత్వం కూడా సహకరిస్తోంది.

చాలా సరదాగా ఉంది

ఈ పనిచేయడం చాలా సరదాగా ఉంది. విత్తనాలు మట్టిలో పెట్టి బాల్స్‌లాగా చుడుతున్నాం. చాలా చేశాను నేను.

– జి.మోక్షిత్, 6వ తరగతి, జేవై స్కూల్, న్యూకాలనీ

అందరం కలిసి చేశాం



మా స్నేహితులందరం కలిసి విత్తన బంతులు చేశాం. ఎంతో మంచి పని చేస్తున్నామని మా టీచర్ మమ్మల్ని మెచ్చుకున్నారు. నేను ఎక్కువ చేశాను.

– కె.జయంత్, 6వ తరగతి, జేవై స్కూల్, న్యూకాలని



విత్తన బంతులు చేస్తున్న విద్యార్థులు

గర్వంగా ఉంది

మొక్కల పెంపకం అంటే నాకు ఇష్టం. ఈ పద్ధతిలో విత్తనాలు మా చేత తయారు చేయించడం ఎంతో సరదాగా ఉంది. మా స్కూల్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వాళ్లు నిర్వహిస్తున్న కార్యక్రమంలో మేము భాగం కావడం ఎంతో గర్వంగా ఉంది.

– పి.సహస్ర, 8వ తరగతి, న్యూకాలనీ

సహజ సిద్ధంగా పండించాలి



జిల్లాలో ఈ నెలాఖరులోగా 20 స్కూళ్లకు వెళ్లి వారితో విత్తన బంతులు తయారు చేయిస్తాం. ఎవరైనా స్కూళ్ల వద్ద ఇలా తయారు చేసేందుకు సిద్ధపడితే 8639456848 నంబరును సంప్రదించాలి.3600 రకాల విత్తనాలు రెడీగా ఉన్నాయి.

– డి.రవి, ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధి

'ఒలింపిక్స్‌లో పతకాల మోత మోగించండి'



చీర్స్4 భారత్–పారిస్ ఒలింపిక్స్ 2024 సంఘీభావ ర్యాలీలో అధికారులు, కోచ్‌లు, క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్ గేమ్స్‌లో భారత క్రీడాకారులు పతకాల మోత మోగించాలని ఆకాంక్షిస్తూ క్రీడాకారులు శ్రీకాకుళంలో ఆదివారం ర్యాలీ చేశారు. సాయ్, శాప్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ నుంచి కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణం వరకు 'చీర్స్4భారత్– పారిస్ ఒలింపిక్స్ 2024' పేరిట అధికారులు, కోచ్‌లతో కలిసి క్రీడాకారులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, సెట్‌శ్రీ సీఈఓ బీవీ ప్రసాదరావు, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడల అభివృద్ధికి సమష్టిగా కృషిచేద్దామని పిలుపునిచ్చే అధికారులు క్రీడాకారుల అభినందన ర్యాలీకి కనీసం తమను ఆహ్వానించకపోవడంపై పలు క్రీడాసంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు



సూర్యనమస్కార పూజలు చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం భక్తులు ప్రత్యేకంగా పూజలు చేయించుకున్నారు. ప్రత్యేక ఆదివారం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లాకు చెందిన పలువురు అధికారులు ఆదిత్యున్ని దర్శించుకున్నారు. ఒక్క రోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల ద్వారా రూ.69,300, విరాళాల రూపంలో రూ. 87,653, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.50 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లుగా అధికారులు తెలియజేశారు.

'ప్రజా పోరాటాలను బలోపేతం చేయాలి'



చారుమజుందార్‌కు జోహార్లు అర్పిస్తూ ఊరేగింపు చేస్తున్న వివిధ ప్రజాసంఘాల నాయకులు

పలాస: ప్రజా పోరాటాలను బలోపేతం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు సూచించారు. పలాస మండలం నీలావతి గ్రామంలో ఆదివారం నక్సల్బరీ ఉద్యమ నిర్మాత చారుమజుందార్ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ చారుమజుందార్ ఇచ్చిన పిలుపు మేరకు శ్రీకాకుళంలో సాయుధ రైతాంగ గిరిజన పోరాటం జరిగిందని, ఆ పోరాటంలో ఉద్దానం ప్రాంతానికి చెందిన తామాడ గణపతితో పాటు ఎంతో మంది వీరులు తమ ప్రాణాలను తృణపాయంగా అర్పించారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 360 మంది వీరులు తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. నేటికీ ఆ వీరుల కలలు సాకారం కాలేదని, ఆ బాటలోనే నేడు ప్రజా ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనరు జుత్తు వీరాస్వామి, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు ఎం.వినోద్, సార్ర రామారావు, మురిపింటి తాతారావు, రాపాక చంద్రయ్య, సవర బంగ్లా కుమార్, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలు చేయాల్సిందే

- ఎమ్మెల్సీ నర్తు రామారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

వజ్రపుకొత్తూరు: హామీలు అమలుచేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, ఇలాగే కొనసాగితే రెండేళ్లలో జనం రోడ్లపైకి రాక తప్పదని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. వజ్రపుకొత్తూరులో ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణితో కలిసి ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. టీడీపీ కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల సంక్షేమ పట్టని చంద్రబాబు అమలు కాని హామీలు ఇచ్చి, ఇప్పుడు భయమేస్తోందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. 2019కి ముందు రుణమాఫీ చేయక రైతుల వ్యతిరేకత చవి చూసిన సీఎం చంద్రబాబు మళ్లీ అదే తరహాలో ప్రజల నుంచి ఇప్పటికే తీవ్ర వ్యతిరేకత మూట గట్టుకుంటున్నారని అన్నారు. వైఎస్ జగన్ పాలనను జనం గుర్తు చేసుకుంటూ ఆయనను దేవుడిలా భావిస్తున్నారని, అమ్మ ఒడి, రైతు భరోసా, జగనన్న ఇల్లు, ఆసరా రుణమాఫీ, చేయూత, తదితర పథకాలతో ప్రతి నెలా ఆదాయం సమకూరేలా పాలించారని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం అనంతరం పేదలకు పెద్ద ఎత్తున ఫలాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలోని హామీలు అమలు చేయాల్సిందేనని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, కంచిలి జెడ్పీటీసీ సభ్యుడు ఇప్పిలి కృష్ణారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశవరావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తమ్మినేని శాంతారావు, జిల్లా యువజన విభాగం కార్యదర్శి దున్న బాలరాజు, గూడ ఈశ్వరరావు, పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉందాం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, పక్కనే ఎమ్మెల్యే రమణమూర్తి

- జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ
- ఉద్యోగులపై ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి మండిపాటు

అరసవల్లి: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉందామని, వసతి గృహాలను పర్యవేక్షించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన 1వ, 2వ, 4వ, 7వ జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో ఆమె అధ్యక్షురాలిగా మాట్లాడారు. ఈ సందర్భంగా పలు శాఖల ప్రగతిపై ఆమె సమీక్షించారు. ఇటీవల సీజనల్ వ్యాధులతో కొందరు విద్యార్థులు వసతి గృహాల్లో మృతి చెందడం ఎంతో బాధించిందని అన్నారు. వెన్నెలవలస ఆశ్రమ గిరిజన పాఠశాల విద్యార్థిని మలేరియాతో చనిపోయిన తర్వాత అధికారులు స్పందించడం, టెస్టులు, మందులంటూ హడావుడి చెయ్యడం సరికాదని, అసలు ఇలాంటి దుస్థితి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. జెడ్పీ సమావేశాలకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన జిల్లా స్థాయి అధికారులంతా తప్పనిసరిగా హాజరుకావాలని లేదంటే చర్యలుంటాయన్నారు. అనంతరం మధ్యాహ్నం వీరఘట్టం జెడ్పీటీసీ జంపు కన్నతల్లి 3వ, 5వ, 6వ స్థాయీ సంఘ సమావేశాలకు అధ్యక్షత వహించి ముగించారు.

ఎమ్మెల్యేలు ఏమన్నారంటే..

- నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ... పోలాకి, జలుమూరు తదితర మండలాల్లో జల్‌జీవన్ మిషన్ పనులు ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. అలాగే గత ప్రభుత్వంలో చేపట్టిన పనులేవీ ఇప్పుడు అకారణంగా నిలిపివేయద్దని తెలిపారు.
- ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు మాట్లాడుతూ భారీ పరిశ్రమలు బోర్డు తప్పుతుంటే అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

ఉద్యోగులపై కూన ఆగ్రహం

జెడ్పీ సమావేశాలకు ఉన్నతాధికారులు హాజరు కావడం లేదని, వచ్చిన అధికారులు కూడా కాలేజీ స్టూడెంట్లలా వస్తూ.. సమాచారం లేకుండా మాట్లాడుతున్నారని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి మండిపడ్డారు. జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో భాగంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ 2019 మార్చి 31 నాటికి జిల్లాలో అన్ని శాఖల ఇంజినీరింగ్ పనులకు చెందిన పెండింగ్ ప్రోగ్రెస్ వివరాలను తర్వాతి సమావేశానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆమదాలవలస రోడ్డుకు మరో 15 రోజుల్లో కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లింపులు చేయిస్తానని సభలో మాటిస్తున్నానని, వెంటనే పనులు చేపట్టే బాధ్యత తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్‌ను ఆదేశించారు. కీలకమైన శ్రీకాకుళం పంచాయతీరాజ్ శాఖ పీఆర్ఐ ఈఈ పోస్టును అనకాపల్లికి పంపించేశారని, ఆ పోస్టును తెప్పించేలా తీర్మానించాలని జెడ్పీ సీఈఓ వెంకటేశ్వరరావుకు ఆదేశించారు. అలాగే ఉపాధి నిధులతో నిర్మించిన మిల్క్ బల్క్ యూనిట్లు, డిజిటల్ లైబ్రరీల నిర్మాణాలను జిల్లా వ్యాప్తంగా నిలిపివేయాలని, దీనిపై ప్రభుత్వ పెద్దలతో మాట్లాడుతానన్నారు. అలాగే సొంతంగా బతకాల్సిన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఆ సంస్థ ఇప్పుడు అధోగతికి చేరిందన్నారు. ఇక రాష్ట్రానికి త్వరలో బుందేల్‌ఖండ్ ప్యాకేజి రానుందని, తద్వారా జిల్లాకు వెనుకబడిన జిల్లా కోటాలో రూ.50 కోట్లు వచ్చే అవకాశం ఉందన్నారు.

సమయాన్ని పట్టించుకోకుండా..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవి, పక్కనే ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జిల్లా పరిషత్‌లో ఆదివారం జరిగిన స్థాయీ సంఘ సమావేశాల తీరు సర్వత్రా చర్చనీయాంశమైంది. మొత్తం ఏడు స్థాయీ సంఘ సమావేశాలకు ఆయా సంఘాల సభ్యులు (జెడ్పీటీసీలు), ఒకరిద్దరు చట్ట సభ సభ్యుల హాజరుతో సమావేశాలను నిర్వహించాల్సి ఉంది. అయితే ఆదివారం సమావేశాల్లో ఏ మాత్రం సమయాన్ని పాటించకుండా 1వ, 7వ, 5వ స్థాయీ సంఘ సమావేశాలన్నింటినీ ఎమ్మెల్యే కూన రవి సమీక్షలతోనే గడిపేయడంతో మిగిలిన జెడ్పీటీసీ సభ్యులు మిన్నకుండిపోవాల్సి వచ్చింది. ఒక్క 7వ స్థాయీ సంఘ సమావేశమే సుమారు మూడున్నర గంటల పాటు సాగిందంటే అర్థం చేసుకోవచ్చు. ఇది చాలదన్నట్లుగా ఇక మీదట స్థాయీ సంఘ సమావేశాలు, సర్వసభ్య సమావేశాలను రెండేసి రోజుల పాటు నిర్వహించాలని, ఈ మేరకు తీర్మానాలు చేసి, ప్రభుత్వానికి పంపించండని జెడ్పీ చైర్‌పర్సన్, సీఈఓలకు సూచించారు. దీంతో అంతా ముక్కున వేలేసుకునే పరిస్థితి దాపురించింది.

ఆకాశ వీధిలో..

దాదాపు వారం రోజుల తర్వాత ఆకాశ వీధిలో సూరీడి గమనం కనిపించింది. సాయంత్రం సమయంలో లొద్దపుట్టి ప్రాంతంలో మేఘాలు ఇలా కనువిందు చేశాయి.

– ఇచ్ఛాపురం రూరల్



క్లుప్తంగా

నీలమణిదుర్గ ఆలయానికి భక్తుల తాకిడి



క్యూలైన్‌లో ఉన్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, పాతపట్నం గ్రామదేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆషాఢమాసం సందర్భంగా తెల్లవారుజాము నుంచే స్థానికులతో పాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఘటాలతో మొక్కులు చెల్లించారు. పలువురు వాహన పూజలు చేశారు.

కిడ్నీ బాధితుడికి చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

హిరమండలం: మండలంలోని పిండ్రువాడ గ్రామానికి చెందిన కింజరాపు శంకరరావుకు రెండు కిడ్నీలు పాడైపోవడంతో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. కిడ్నీ మార్పిడి చేస్తే ఫలితం ఉంటుందని డాక్టర్లు చెప్పారు. అయితే నిరుపేద కుటుంబం కావడంతో దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నాడు. ఈ క్రమంలో ఎల్‌ఎన్‌పేట, హిరమండలం మండలాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు, స్నేహితులు రూ.70,200 సేకరించారు. ఆ మొత్తాన్ని ఆదివారం మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు టి.తిరుపతిరావు, హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు పి.శ్రీధర్ చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.సత్యనారాయణ, కె.సింహాచలం, ఎం.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి సాయం



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

సోంపేట: మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన తోట రాజారావు వలస కార్మికుడిగా విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయనకు ముగ్గురు కుమార్తెలు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. ఈ నేపథ్యంలో రాజారావుతో కలిసి చదివిన 1996–2001 బ్యాచ్ మామిడిపల్లి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం రూ.2,05,250 సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం కుమార్తెల పేరిట పోస్టాఫీసులో ఫిక్సిడ్ డిపాజిట్ చేశారు. కార్యాక్రమంలో పలువురు పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

పొలం నీటి కోసం తోపులాట

- కోళ్లపేటలో వృద్ధుడి మృతి



మృతిచెందిన తవుడు

శ్రీకాకుళం క్రైమ్/గార : మండలంలోని అంపోలు పంచాయతీ కోళ్లపేటలో పొలం నీటి కోసం జరిగిన తోపులాటలో గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు ఆదివారం మృతిచెందాడు. రూరల్ సీఐ లెంక సన్యాసినాయుడు తెలిపిన వివరాల మేరకు.. కోళ్లపేట రోడ్డు పక్కన పంట పొలాలు వెంబడి బట్టి నీరు వస్తుండటంతో అంతా దమ్ముల కోసం తమ పొలాల్లోకి నీటిని వదిలేందుకు ఉపక్రమించారు. గ్రామానికి చెందిన వంజల సునీత పొలం పక్కనే తట్ట తవుడు (60) పొలం ఉంది. తవుడు పొలం నీరు నిండాలంటే సునీత పొలం నుంచే రావాలి. దీంతో తవుడు ఆదివారం ఉదయం నీటిని పూను వేసేందుకు వెళ్లగా అక్కడి కొచ్చిన సునీత అడ్డుపడింది. సునీత భర్త , తవుడు కుమారుడు, మరికొంతమంది చేరుకుని వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరగడంతో తవుడును సునీత నెట్టేయడంతో కిందపడి స్పృహ కోల్పోయాడు. వెంటనే రిమ్స్‌కు తరలించగా అప్పటికే తవుడు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గొడవపడిన ఇరు వర్గాలూ బంధువులే కావడం, తవుడుకు వృద్ధాపరీత్యా కొన్ని వ్యాధులున్నట్లు గార పోలీసులు చెప్పారు. తవుడు కుమారుడు తట్ట సింహాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు 105 బీఎన్ఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ఇన్‌స్పైర్ చేద్దామా!



సైన్స్ ప్రాజెక్టు సన్నద్ధతలో విద్యార్థులు

- ఇన్‌స్పైర్ మనాక్ పేరిట పాఠశాల విద్యార్థులకు ప్రాజెక్టుల పోటీ
- ఐదు ప్రధాన అంశాలుగా నమూనాల రూపకల్పన
- 2 వేలకుపైగా ప్రాజెక్టుల నామినేషన్ల లక్ష్యంగా విద్యాశాఖ అడుగులు
- సెప్టెంబర్ 15 వరకు గడువు

శ్రీకాకుళం న్యూకాలనీ:

ఇన్‌స్పైర్ పోటీలకు వేళయ్యింది. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇన్నోవేషన్ ఇన్‌స్పైర్ మనాక్ వేదికగా నిలుస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ ఏటా ఇన్‌స్పైర్ మనాక్ అవార్డ్స్ పేరిట విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తోంది. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ రాష్ట్ర సాంకేతిక మండలి సహకారంతో 2024–2025 విద్యా సంవత్సరానికిగాను పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. సెప్టెంబర్ 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గడువు విధించారు. విద్యార్థులు రూపొందించే ప్రాజెక్టు నమూనా, ఇతర వివరాలను ఇన్‌స్పైర్ అవార్డ్స్–డీఎస్టీ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. సామాజిక సమస్యలకు పరిష్కారం సూచించేలా విద్యార్థులు చక్కటి ఆలోచనతో డ్రాఫ్ట్ రూపంలో తీర్చిదిద్ది ఇన్‌స్పైర్ అవార్డు మనాక్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. వీటిల్లో ఎంపికచేసిన ప్రాజెక్టుకు రూ.10 వేలు చొప్పున విద్యార్థి బ్యాంకు ఖాతాకు జమ చేస్తారు. ఈ డబ్బులతో ఉపాధ్యాయుడి సహకారంతో విద్యార్థి ప్రాజెక్టును సిద్ధం చేసి జిల్లా ప్రదర్శనకు రావాల్సి ఉంటుంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు చెందిన ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు సైన్స్ ఉపాధ్యాయులతో కలిసి ప్రాజెక్టులు తయారు చేయాలి. జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పరిధిలో 3053 పాఠశాలలు ఉండగా 254892 మంది చదువుతున్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల్లో 160151 మంది, ప్రైవేటు పాఠశాలల్లో 94741 మంది చదువుతున్నారు. వీరిలో 6 నుంచి 10వ తరగతి వరకు పాఠశాలలు 1033 ఉండగా వీటిల్లో 138066 మంది చదువుతున్నారు.

ఏడాది	నామినేషన్లు	జిల్లాస్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు
2018-19	1470	71
2019-20	1812	483
2020-21	1730	263
2021-22	1762	257
2022-23	1678	207
2023-24	2100	330
2024-25	రిజిస్ట్రేషన్లు ప్రారంభం	

2 వేలకుపైగా ప్రాజెక్టులు లక్ష్యంగా..

జిల్లా వ్యాప్తంగా 2 వేలకుపైగా ప్రాజెక్టు నమూనాల నామినేషన్‌ల స్వీకరణ లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు అడుగులు వేస్తున్నారు. ఈ విద్యాసంవత్సరంలో ఐదు ప్రధాన అంశాలపై ప్రాజెక్టుల రూపకల్పన చేపట్టనున్నారు. అందులో 1. మేక్ ఇన్ ఇండియా, 2.స్కిల్ ఇండియా, 3.స్వచ్ఛ భారత్, 4.సస్వాస్థ(ఆరోగ్య) భారత్, 5. ఏదైన సరికొత్త ఇన్నోవేటివ్ ప్రాజెక్టులను రూపొందించాలని నిర్ణయించారు. ప్రతి పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు తగ్గకుండా దరఖాస్తు చేసేలా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు.



దరఖాస్తు ఎలా చేయాలంటే..

- తొలుత పాఠశాల స్థాయిలో ఐడియా కాంపిటీషన్ నిర్వహించాలి.
- స్థానిక అంశాలపై డిజైన్‌చేసి మెప్పించగలగాలి.
- తరగతి వారీగా ఉత్తమ ఆలోచనను ఎంపిక చేసి అందుకు అవసరమైన ప్రాజెక్టు రూపొందించాలి.
- విద్యార్థి పేరు, తండ్రి పేరు, తరగతి, విద్యార్థి బ్యాంకు ఖాతా ఆధార్ కార్డు ఎంటర్ చేయాలి.
- ప్రాజెక్టు పేరు, శాస్త్ర సాంకేతికతకు సంబంధించిన అంశాలు ఉండేలా చూసుకోవాలి.
- ప్రాజెక్టు ఎంపిక: రెండు నెలల్లో పూర్తి చేసి జిల్లా స్థాయి పోటీల ప్రదర్శన చేపడతారు. ప్రధానమైనవాటి ప్రదర్శనకు అనుమతిస్తారు. జిల్లాస్థాయి ఉత్తమ ఎంపికైన ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి పంపిస్తారు. ఎంపికై న ప్రాజెక్టును ప్రయోగం నిమిత్తం బ్యాంకు ఖాతాలో రూ. పది వేలు నగదు జమ చేస్తారు.



ప్రాజెక్టు రూపకల్పనను వివరిస్తున్న విద్యార్థులు(ఫైల్)

బాలశాస్త్రవేత్తలకు పునాది..



విద్యార్థులు బాలశాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలు చక్కటి అవకాశం. ప్రాజెక్టుల తయారు చేసేలా విద్యార్థులను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి 2 వేలకు పైగా నామినేషన్లను చేయించేలా లక్ష్యంగా పెట్టుకున్నాం.

– ఎస్.కుమారస్వామి,
జిల్లా సైన్స్ అధికారి, శ్రీకాకుళం

హెచ్‌ఎంలు చొరవ తీసుకోవాలి..



ప్రాజెక్టుల రూపకల్పనపై సైన్స్ ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి. ప్రతి పాఠశాల నుంచి తప్పనిసరిగా ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసి నమూనాలను ఆ వెబ్‌పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. ముఖ్యంగా ప్రతి ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం తప్పనిసరిగా ఇన్‌స్పైర్ మనాక్ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలి. ఈ విషయంలో ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

– కె.వెంకటేశ్వరరావు,
జిల్లా విద్యాశాఖాధికారి, శ్రీకాకుళం

పది లక్షల మొక్కలు నాటుదాం



సత్యసాయి భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు

శ్రీకాకుళం కల్చరల్: వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు, ఆక్సిజన్ శాతాన్ని పెంచేందుకు 'ప్రేత తరు' పేరుతో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో రాష్ట్రంలో 10 లక్షల మొక్కలు నాటేందుకు నిర్ణయించామని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు అన్నారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు హోటల్లో జిల్లా స్థాయి సత్యసాయి సేవా సంస్థల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసేవ పేరుతో ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో అన్నదానం, వైద్యసేవలు, పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా సత్యసాయి యూనిట్ కప్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, పుట్టపర్తిలో ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని తెలిపారు. 'లిక్విడ్ లవ్' పేరిట రక్తదాన సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, రాష్ట్ర ఐటీ కో–ఆర్డినేటర్ కిషోర్‌కుమార్, రాష్ట్ర విద్యా జ్యోతి ఇన్‌చార్జి గురుప్రసాద్, రాష్ట్ర యూత్ కో–ఆర్డినేటర్, జిల్లా సేవా సమన్వయకర్త పప్పల నాగేశ్వరరావు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి బోయిన నరసింహమూర్తి, భజన్స్ ఇన్‌చార్జి పి.గంగాధర్, గ్రాండ్ షణ్ముఖ, శశికాంత్, శివకుమార్, చరణ్, జిల్లా పదాధికారులు, మందిర కన్వీనర్లు, జోనల్ కన్వీనర్లు, భక్తులు పాల్గొన్నారు.

'కేఆర్‌ను బహిష్కరించడం హాస్యాస్పదం'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నుంచి బహిష్కరించబడిన జి.ఆస్కారరావు, డి.శ్రీకాంత్‌రాజులు మీడియా సమావేశం పెట్టి రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్. సూర్యనారాయణని అధ్యక్షుడిగా బహిష్కరించామనడం హాస్యాస్పదంగా ఉందని శ్రీకాకుళం జిల్లా ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు అలికాన రాజేశ్వరి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలపై పోరాటం చేస్తున్న కె.ఆర్.సూర్యనారాయణకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేసారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లేకుండా విజయవాడలో మీడియా సమావేశం నిర్వహించి కేఆర్‌ను బహిష్కరించామనడాన్ని ఆమె తప్పుపట్టారు.

పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష సాయం



రూ.లక్ష నగదు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కాశీబుగ్గ : మందసలోని శ్రీరాజాశ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం పునరుద్ధరణకు పూర్వ విద్యార్థులు ముందుకు వస్తున్నారు. 2001 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు లక్ష రూపాయలు సేకరించి మందస హైస్కూల్ ఓల్డ్ బిల్డింగ్ రెనోవేషన్ ఫోరం వాట్సాప్ అడ్మిన్ ప్రొఫెసర్ పట్నాల మోహన రావు ఆచారికి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరింత మంది దాతలు ముందుకొచ్చి పాఠశాల అభివృద్ధికి సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సిందిరి జగన్నాథరావు, కుప్పాయి గోపాలరావు, రవికుమార్ మహంతి, దక్కత సంతోష్, మామిడి చిరంజీవి, శంకర మహరణ, ఎస్.సూర్యారావు, నిమ్మన సురేష్, టి.హేమసుందర్, బత్తుల మురళీ, బమ్మిడి శాంతిలత, కనగల భారతి, కృష్ణకుమారి, జ్యోతి, హెచ్‌ఎం రవికుమార్, శిష్టు సోమనాథ్, ప్రభాకర్ పట్నాయక్, రవీంద్ర, దువ్వు జగదీష్, ఎంపీటీసీ కంచిబెహరా పాల్గొన్నారు.

ప్రగతిశీల కార్మిక సమాఖ్య మహాసభల కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘం నేతలు

పలాస: త్వరలో జరగనున్న ప్రగతిశీల కార్మిక సమాఖ్య శ్రీకాకుళం జిల్లా రెండో మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి పుచ్చ దుర్యోధనరావు, అధ్యక్షుడు దేవాడ నారాయణమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద మహాసభల కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 44 చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో కార్పొరేటు సంస్థలకు సహజ వనరులను, ప్రభుత్వ ఆస్తులను అప్పనంగా కట్టబెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పోరాడాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కారి పురుషోత్తం, మద్దిల ధర్మారావు, తామాడ త్రిలోచనరావు, దాసరి శ్రీరాములు, గర్తం కూర్మారావు పాల్గొన్నారు.

వీల్‌ఛైర్ బాస్కెట్‌బాల్ పోటీలకు తులసయ్య



పందూరు తులసయ్య

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని తులసిగాం గ్రామానికి చెందిన దివ్యాంగుడు పందూరు తులసయ్య నేషనల్ వీల్‌ఛైర్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం తెలంగాణ వీల్‌ఛైర్ బాస్కెట్‌బాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న తులసయ్య గతంలో పలుమార్లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించాడు. ఇటీవల కోయబంత్తూర్‌లో జరిగిన సౌత్‌జోన్ పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున పాల్గొని చక్కని ప్రతిభ కనబర్చడంతో మరోసారి జట్టుకు ఎంపికయ్యాడు. ఈ ఏడాది అక్టోబర్‌లో జరగబోయే పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ సందర్భంగా పలువురు క్రీడాభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

ట్రిపుల్ ఐటీ రెండో జాబితాపై కసరత్తు

- ఈ నెల 30వ తేదీలోపు రిజిస్ట్రేషన్లు
- ఆగస్టు 3వ తేదీన మెరిట్ జాబితా
- ఆగస్టు మొదటి వారంలో కౌన్సెలింగ్
- ఆగస్టు 19 నుంచి క్లాస్‌వర్క్



ఆర్‌జీయూకేటీ క్యాంపస్

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ఎస్ఎం పురం క్యాంపస్ మొదటి విడత ప్రవేశాలు పూర్తయ్యాయి. 1100 సీట్లకు 1110 అడ్మిషన్లు కోసం మెరిట్ లిస్టు విడుదల చేయగా, ఇందులో 1035 మందికి 10వ తరగతి, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు కల్పించారు. 75 ప్రత్యేక కేటగిరీల రిజర్వేషన్‌కు సంబంధించినవి. రెండో విడత కోసం కసరత్తులు చేస్తున్నారు.

- క్యాంపస్‌లో 1035 మందికి 26, 27 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించారు.
- 172 సీట్లు మిగిలిపోయాయి.
- ప్రత్యేక కేటగిరీ రిజర్వేషన్ మేరకు అర్హత ధ్రువీకరణ పత్రాలు, జారీ చేసిన సంస్థలకు పరిశీలన కోసం పంపించారు.
- 172 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా, వీరికి మరో అవకాశం కల్పించారు.
- ఈ విద్యార్థులు డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.ఆర్‌జీయూకేటీ.ఐఎన్‌లో మళ్లీ అప్లయ్ చేసుకోవాల్సి ఉంటుంది.
- రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే సీటు కోల్పోతారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు కౌన్సెలింగ్‌కు పిలిచి ప్రవేశం కల్పిస్తారు.
- మరో పక్క రాష్ట్రంలో నాలుగు క్యాంపస్‌లు ఉండగా, క్యాంపస్‌ల మార్పునకు సైతం వెబ్‌సైట్‌లో ఆప్షన్ ఇచ్చుకోవాల్సి ఉంటుంది.
- గతంలో దరఖాస్తు చేసుకోని, సీటు లభించని విద్యార్థులు మాత్రం ఎలాంటి ఆప్షన్లు ఇవ్వాల్సిన అవసరం లేదు. మెరిట్ ప్రాతిపదికన వీరికి సీట్లు లభిస్తాయి.
- ఈ నెల 30వ తేదీలోపు ఆప్షన్లు మార్పు కావాలనుకునే విద్యార్థులు వెబ్‌సైట్‌లో ఆప్షన్లు ఇచ్చుకోవటం, కౌన్సెలింగ్‌కు హాజరు కాని విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవటం చేయాలి.
- ఆగస్టు 3వ తేదీన రెండో విడత కౌన్సెలింగ్ మెరిట్ లిస్టు ప్రకటిస్తారు. గైర్హాజరు, ఖాళీసీట్లలో విద్యార్థుల 10వ తరగతి మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.
- ఆగస్టు మొదటి వారంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.
- ప్రస్తుతం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు వెబ్‌సైట్ అందుబాటులో ఉంది. ఈ నెల 27వ తేదీ రాత్రి ఏడు గంటల నుంచి అందుబాటులో ఉంచారు.
- 30వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు వెబ్‌సైట్ విద్యార్థులకు అందుబాటులో ఉంటుంది.
- ప్రస్తుతం క్యాంపస్‌లో సీట్లు లభించిన విద్యార్థులు ఆగస్టు 19, 20 తేదీల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. 19 నుంచి క్లాస్‌వర్క్ సైతం ప్రారంభిస్తారు.

షెడ్యూల్ మేరకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

షెడ్యూల్ మేరకు కౌన్సెలింగ్ హాజరు కాని వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. క్యాంపస్ మార్పు కోరుకున్న వారు సైతం ఆప్షన్లు ఇచ్చుకోవాలి. సీటు రాని వారు ఎలాంటి రిజిస్ట్రేషన్ చేయాల్సిన అవసరం లేదు. మెరిట్ లిస్టులో పేర్లు వెల్లడిస్తాం. రెండో విడత కౌన్సెలింగ్ ఆగస్టు మొదటి వారంలో నిర్వహిస్తాం.

– కేవీజీడీ బాలాజీ,
డైరెక్టర్, ఎస్ఎంపురం ఆర్‌జీ యూకేటీ క్యాంపస్

విశ్వసనీయత కాపాడుకోవాలి

- జర్నలిస్టుల మహాసభలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



మాజీ మంత్రి అప్పలరాజును సత్కరిస్తున్న జర్నలిస్టులు

కాశీబుగ్గ: తన రాజకీయ జీవితంలో మీడియా పాత్రను దగ్గరగా గమనించానని, జర్నలిస్టులకు విశ్వసనీయతే ప్రధానమని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాసలో ఆదివారం నిర్వహించిన ఏపీయూడబ్ల్యూజే జిల్లా 31వ మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏకపక్ష, నియంతృత్వ పోకడలను పౌర సమాజానికి తెలిపే బాధ్యత మీడియాపైనే ఉందన్నారు. మీడియా స్వేచ్ఛ అవసరమని, అదే సమయంలో దుర్వినియోగం కాకూడదని స్పష్టం చేశారు. అనంతరం మీడియా ప్రతినిధులు మాట్లాడుతూ మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో మాజీ మంత్రి అప్పలరాజు ఫొటోలను కొందరు చించివేయడాన్ని ఖండించారు. మీడియా సంబంధిత కార్యక్రమంలో ఇలా చేయడం తగదని అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే జిల్లా శాఖ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా చిగురువలస జగదీష్, చింతాడ అప్పలనాయుడులను ఏకగ్రీవంగాఎన్నుకున్నారు. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పైడి బాలకృష్ణ, మొదలవలస వాసు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు ఐఅండ్‌పీఆర్ జిల్లా అధికారి కె.చెన్నకేశవరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్, సీపీఐ జిల్లా కమిటీ ప్రతినిధి చాపర వేణుగోపాల్, సీపీఎం నేత బమ్మిడి ఆనందరావు, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకలమాధవరావు తదితరులు పాల్గొన్నారు.